క్లుప్తంగా

ఆర్టీసీలో షాపులకు టెండర్లు

రాజమహేంద్రవరం సిటీ: ధవళేశ్వరం, రంగంపేట, కోటిపల్లి బస్టాండ్‌లలో ఖాళీగా ఉన్న దుకాణాల్లో వ్యాపారం నిర్వహించుకునేందుకు ఆసక్తి కల వ్యాపారుల నుంచి సీల్డ్ టెండర్లు కోరుతున్నట్లు రాజమహేంద్రవరం ఆర్టీసీ స్టేషన్ డిపో మేనేజర్ షేక్ షబ్నం సోమవారం ప్రకటనలో తెలిపారు. వీటికి సంబంధించిన టెండరు ఫారాలను మంగళవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకూ రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 వరకూ తీసుకోవచ్చన్నారు. 14వ తేదీ మధ్యాహ్నం 2 గంటలలోపు పూర్తి చేసిన దరఖాస్తులను రాజమహేంద్రవరం బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన టెండరు బాక్సులో వేయాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండరుదారుల సమక్షంలో టెండర్లు తీస్తామన్నారు.

గద్దర్‌కు నివాళి

కడియం: మండలంలోని వేమగిరి జంక్షన్‌లో సోమవారం గద్దర్‌కు నివాళులర్పించారు. ఆయన అభిమాని ప్రత్తిపాటి నల్లరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గద్దర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కొత్తూరి బాలనాగేశ్వరరావు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

కడియం: బుర్రిలంకలోని టి.జీవానందం ఆగేపే ప్రేయర్ హౌస్‌లో సోమవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఫెలోషిప్ నాయకులు ఎం.కరుణాకర్, డి.పరంజ్యోతి, డి.రతన్ రాజు, బిషప్ సోలోమెన్ శుభాలను అందజేశారు. సీహెచ్ రత్నదీప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజమండ్రి గేట్‌వే మినిస్ట్రీస్ అధినేత డాక్టర్ వీఎస్సీ ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి సేవకులను ఉద్దేశించి మాట్లాడారు.

దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలి

కడియం: ఏ సామాజికవర్గమైనా ఉన్నత స్థానాన్ని పొందాలంటే రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవాలని జిల్లా మేకలు, గొర్రెలు పెంపకందారుల అభివృద్ధి ఫెడరేషన్ చైర్మన్ దండుబోయిన మూర్తి యాదవ్ అన్నారు. ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. మండల్ కమిషన్ అమలు జరిగిన రోజును మండల్‌డేగా దేశ వ్యాప్తంగా జరుపుకొంటున్నారన్నారు. మండల్ పుణ్యమా అని దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలు 27 శాతం రిజర్వేషన్ల అమలుకు నోచుకున్నారన్నారు. మండల్ సాధికారతతో పని పూర్తి కాలేదని, బీసీల సమగ్ర ఉన్నతికి మరోసారి దేశవ్యాప్త ఉద్యమానికి నడుం బిగించాలన్నారు.

రొట్టెల పంపిణీ



రొట్టెలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికుల సంక్షేమసంఘం సభ్యుడు మల్లికార్జున ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ఇవాంజెలిస్ లెప్రసీ కాలనీలో రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు. సుమారు 40 మంది రోగులకు వైఎస్సార్ సీపీ నాయకులు యెనుముల త్యాగరాజు, మత్సేటి శివ చేతుల మీదుగా అందించారు.

శరీర దానంపై సదస్సు రేపు

రాజానగరం: స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల ప్రాంగణంలోని జనరల్ ఆస్పత్రి, చరక ఆడిటోరియంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు శరీర దానంపై అవగాహన సదస్సు జరుగుతుంది. జీఎస్ఎల్ వైద్య కళాశాల, సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 'మరణానికి అతీతమైన జీవనం – వైద్య విజ్ఞానాల అధ్యయనానికి శరీర దానం' అనే అంశంపై నిర్వహించే ఈ సదస్సులో ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరి సీతామహాలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొంటారు.

సెంట్రల్ జైలు ఖైదీ ఆత్మహత్య

కంబాలచెరువు: రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీ మన్నే రాజేష్ (39) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణా జిల్లా వత్సవాయికి చెందిన రాజేష్ హత్య కేసులో జగ్గయ్యపేట జైలుకి వచ్చాడు. అయితే అతడి ఆరోగ్య కారణాలతో మేజిస్ట్రేట్ ఆదేశాలతో ఈ ఏడాది ఏప్రిల్ 18న రాజమమహేంద్రవరం సెంట్రల్ జైలుకి తరలించారు. రాజమహేంద్రవరం జైలులోని ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో జైలుతో ఉరివేసుకున్నాడు. గమనించిన సిబ్బంది వెంటనే అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని అతడి కుటుంబ సభ్యులకు జైలు అధికారులు సమాచారం ఇచ్చారు. ఘటనపై ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో జైలు అధికారులు ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజానగరం: మండలంలోని తూర్పుగానుగూడెం వద్ద జాతీయ రహదారిపై నడిచి వెళుతున్న వ్యక్తి సోమవారం రాత్రి లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఆ గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి వద్ద ఉన్న సంచిలో ఒక జత బట్టలు ఉన్నాయి. సుమారు 35 ఏళ్లు ఉంటాయని అంచనా వేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ముఖ్యమంత్రికి స్వాగతం



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న ఎంపీ భరత్ రామ్, ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్, కమిషన్ దినేష్ కుమార్, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి - రాజమహేంద్రవరం సిటీ

బ్యాడ్మింటన్‌లో భళా..

- సత్తా చాటిన శ్రీమోహిత్
- సౌత్ జోన్ నేషనల్ పోటీలకు ఎంపిక



తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయిలో పోటీల్లో విజేతగా నిలిచి ట్రోఫీ అందుకుంటున్న శ్రీమోహిత్

ప్రకాశం నగర్: తొమ్మిదేళ్లప్రాయంలోనే బ్యాడ్మింటన్‌ను ప్రారంభించిన కొత్తపల్లి శ్రీమోహిత్ మండల, జిల్లా స్థాయిలో పలు పతకాలు సాధించాడు. ఇటీవల తిరుపతిలో జరిగిన ఏపీ స్టేట్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్ 19 సింగల్స్ విభాగంలో విజేతగా నిలిచాడు. డబుల్స్ విభాగంలో రాజమహేంద్రవరానికి చెందిన మోహిత్ పాటు చరణ్ గణేష్ విజయం సాధించి సత్తా చాటారు. తండ్రి బాల సుబ్రహ్మణ్యం స్ఫూర్తితో మోహిత్ అండర్ 15, 17 విభాగాల్లో ఉమ్మడి జిల్లా కాకినాడలో జిల్లా స్థాయిలో విజేతగా నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. బెంగళూర్‌లోని ఆల్ ఇండియా ర్యాంకింగ్ టోర్నమెంట్ అండర్ 19 డబుల్స్ విభాగంలో సెమీ ఫైనాల్స్‌కు చేరుకుని, ఢిల్లీలోని ఓల్డ్ జూనియర్ సెలక్షన్ ట్రయల్స్‌కు అర్హత సాధించాడు. 17 ఏళ్ల వయసులోనే మోహిత్ ఈ ఘనత సాధించాడు.

చదువులోనూ రాణింపు

బ్యాడ్మింటన్ ఆటలో రాణిస్తున్న మోహిత్ ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. చదువుతో పాటు ఆటకు తగిన సమయం కేటాయిస్తున్నాడు. బ్యాడ్మింటన్‌లో మెళకువలు నేర్చుకుని జాతీయ స్థాయిలో రాణించడమే ధ్యేయంగా శిక్షణ తీసుకుంటున్నాడు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్‌లో శిక్షణ తీసుకుంటున్న మోహిత్ మరిన్ని పతకాలు సాధించి జాతీయ స్థాయిలో జిల్లా ఖ్యాతిని మరింత పెంచాలని అసోసియేషన్ సభ్యులు ఆకాంక్షిస్తున్నారు.

క్రీడాభివృద్ధికి తోడ్పాటు

జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జక్కంపూడి రాజా పర్యవేక్షణలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు రాజమహేంద్రవరంలో ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 700 మంది క్రీడాకారులకు హాజరయ్యారు. వీరందరికీ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ తరఫున ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, భోజనం, రాత్రి భోజన సదుపాయలను కల్పించి క్రీడా అభివృద్ధికి పెద్దపీట వేశారు.

రక్షిత తాగునీరు సరఫరా చేయండి

రాజమహేంద్రవరం సిటీ: వరదల నేపథ్యంలో నగర ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ నగర పాలక సంస్థ అధికారులను కోరారు. సోమవారం స్థానిక పుష్కరాల రేవు సమీపంలోని గోదావరి గట్టున ఉన్న హెడ్ వాటర్ వర్క్స్‌ను ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. నీటిని శుద్ధిచేసి ప్రజలకు సరఫరా చేసే విధానాన్ని స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాము చేపట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ – ఆదిరెడ్డితో అడుగేద్దాం కార్యక్రమంలో ప్రజలు తాగునీటిపై సమస్యలు తెలిపారన్నారు. అందుకు పరిశీలించేందుకు వచ్చామన్నారు.

నేడు చంద్రబాబు సదస్సు

పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మంగళవారం మోరంపూడి సమీపంలోని గాదాలమ్మ నగర్‌లోని బీవీఆర్ కన్వెన్షన్ హాల్లో వివిధ రంగాలకు చెందిన మేధావులతో సదస్సు నిర్వహిస్తారని ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. అనంతరం సీతానగరం మండలం పురుషోత్తపట్నంలోని ఫేజ్–1ను సందర్శిస్తారని, అక్కడ నుంచి కోరుకొండలో సాయంత్రం జరిగే బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు.

ఉద్యోగుల సమస్యలపై సీఎం సానుకూలం



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీ ఎన్‌జీవో సంఘ నాయకులు

కంబాలచెరువు: ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని నగర ఎన్‌జీవో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు నాయుడు, ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ హేమంతి ఆధ్వర్యంలో సోమవారం ఏపీ ఎన్‌జీవో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయడం, దశాబ్దంగా పెండింగ్‌లో ఉన్న ఏపీవీవీపీ ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా జీతాలు, అడగకుండా పీఆర్సీ ఏర్పాటు వంటి చారిత్రాత్మక నిర్ణయాలను సీఎం తీసుకున్నారన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలో జరిగే మహాసభలకు ముఖ్యమంత్రి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్, అనిల్ కుమార్, మాధవరావు, దుర్గాసీ, వేణుమాధవ్ పాల్గొన్నారు.

నవంబర్ 9న విగ్రహాల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శాసన మండలి సభ్యుడు సూర్యనారాయణ, పిల్లి సుబ్రహ్మణ్యం

ప్రకాశం నగర్: శెట్టిబలిజ సామాజికవర్గాన్ని రాజ్యాధికారం వైపు నడిపించిన తన తాత మాజీ ఎమ్మెల్సీ, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడిపూడి సూర్యనారాయణ, తన తండ్రి విశ్రాంత డీజీ కుడిపూడి గోపాలకృష్ణ గోఖలే విగ్రహాలను నవంబర్ 9న అమలాపురంలో ఆవిష్కరిస్తున్నట్లు శాసన మండలి సభ్యుడు కుడిపూడి సూర్యనారాయణ తెలిపారు. స్థానిక సోమాలమ్మ గుడి సెంటర్‌లోని ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పిల్లి సుబ్రహ్మణ్యం ఇంటికి వచ్చిన ఆయన సోమవారం రాత్రి విగ్రహాల ఆవిష్కరణకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం సూర్యనారాయణ మాట్లాడుతూ 2024 నవంబర్ నాటికి శెట్టిబలిజ నామకరణ చేసి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో శెట్టిబలిజల్లో రాజకీయ చైతన్యం తీసుకువచ్చిన దివంగత కుడిపూడి సూర్యనారాయణ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామన్నారు. ఆయన శెట్టిబలిజలను ఓసీ కేటగిరి నుంచి బీసీలోకి తీసుకురావడానికి విశేషంగా పోరాడారన్నారు. ఈ నేపథ్యంలో సూర్యనారాయణతో పాటు ఐఏఎస్ అధికారిగా నీతి, నిజాయితీలతో పనిచేసిన తన తండ్రి గోపాలకృష్ణ గోఖలే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రముఖ నాయకులను ఆహ్వానించి కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించడానికి పిల్లి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఉభయ రాష్ట్రాల శెట్టి బలిజ మహానాడు ఆహ్వాన కమిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సానబోయిన రామారావు, మట్టపర్తి నాగేంద్ర, కుడిపూడి త్రినాథ్, యనమదుల కరుణాకర్, పిల్లి గంగాధర్, కురుమిల్లి స్వరూప్, కొల్లి విష్ణు, మద్దాల సత్యనారాయణ, పిల్లి బాలు, అందనాపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

పోస్టాఫీసుల సందర్శనకు అనుమతి

రాజమహేంద్రవరం సిటీ: మారుతున్న కాలానికి అనుగుణంగా పోస్టాఫీసులలో వచ్చిన వివిధ సాంకేతిక మార్పులు, వివిధ సేవలు, కార్యకలాపాలపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో తపాలా కార్యాలయాల సందర్శన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు రాజమహేంద్రవరం పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ పి.కోమల్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. 76వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం పోస్టల్ డివిజన్ పరిధిలోని రాజమహేంద్రవరం, రామచంద్రపురం ప్రధాన తపాలా కార్యాలయాలను సందర్శించేందుకు సోమవారం నుంచి 12వ తేదీ వరకూ ఆయా ప్రాంతాల పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక అనుమతి ఇచ్చామన్నారు. దీనికి సంబంధిత పాఠశాల యాజమాన్యాలు వినియోగించుకోవాలన్నారు. ఈ ప్రత్యేక అనుమతి కోసం ప్రజాసంబంధాల అధికారి పీవీ సుబ్బయ్యను 70135 95065 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఫ్రీగో బైక్‌ల ప్రారంభం



బైక్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

కంబాలచెరువు: ట్రాఫిక్‌లో సునాయాసంగా వెళ్లగలిగే ఫ్రీగో బైక్‌లను ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్ రెడ్డి సోమవారం రాత్రి ఎస్పీ కార్యాలయం వద్ద ప్రారంభించారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని ఇరుకు సందుల్లోకి సైతం ట్రాఫిక్ పోలీసులు ఈ బైక్‌ల ద్వారా లోపలికి వెళ్లి సమస్యను పరిష్కరించవచ్చు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ర్యాలీ


సీతానగరం: మండలంలోని మూడు క్రిస్టియన్ ఫెలోషిప్‌ల ఆధ్వర్యంలో సీతానగరం నాలుగు బొమ్మల సెంటర్ నుంచి సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణ రాజు, ఎంపీడీవో రమేష్‌కు వినతిపత్రాలు అందజేశారు.

కోరుకొండలో..

మధురపూడి: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ కోరుకొండలో సోమవారం యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కాపవరంలోని పెట్రోలు బంకు నుంచి మెయిన్ రోడ్డు, శివాలయం, బస్టాండ్ సెంటర్, లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ ప్రదర్శన చేశారు. ఆ రాష్ట్రంలో పాలకులకు మంచి బుద్ధి ఇవ్వాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. అనంతరం తహసీల్దార్ పాపారావుకు వినతి పత్రం అందించారు.

సినిమాలు

శ్యామల	:	మెగ్–2
సూర్యమినీ	:	సూర్య సన్ ఆఫ్ కృష్ణన్
సూర్యప్యాలెస్	:	మెగ్–2
స్వామి	:	బ్రో
శివజ్యోతి	:	సామజవరగమన
అనుశ్రీ	:	బ్రో
అశోక	:	ఎల్‌జీఎం–లెట్స్‌గెట్‌మ్యారీడ్
ఊర్వశి	:	బ్లడ్‌అండ్‌చాక్లెట్, హెబ్బులి
రంభ	:	రాజుగారికోడిపలావు
మేనక	:	కృష్ణగాడు అంటే ఒక రేంజ్, ప్రియమైన ప్రియ
అప్సర	:	బేబి



నామవరం

వీఎస్.మహల్ : బ్రో

ధవళేశ్వరం

మురళీకృష్ణ : మెగ్–2, బేబి

కడియం

వెంకటసూర్య : బ్రో

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



వీరవరంలో మహిళా నేత కార్మికులను సత్కరిస్తున్న దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ వీరభద్రయ్య



ఐక్యత చాటుతున్న వీవర్స్ యునైటెడ్ సభ్యులు



ధవళేశ్వరంలో నేతన్నలను సన్మానిస్తున్న పద్మశాలీయ సంక్షేమ సంఘం సభ్యులు

కడియం: వీరవరం చేనేత సహకార సంఘం ఆవరణలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా నేత కార్మికులను సత్కరించి, చీరలు అందజేశారు. సంఘం అధ్యక్షుడు దొంతంశెట్టి చిన వీర్రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఏటా రూ.24 వేలను నేత కార్మికులకు అందజేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకట్రావు, డైరెక్టర్లు శంకర్రావు, సత్తిబాబు, నాగేంద్ర పాల్గొన్నారు.

ప్రకాశం నగర్: జాంపేట ఉమా రామలింగేశ్వర స్వామి కల్యాణ మండపంలో వీవర్స్ యునైటెడ్ నగర శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు కాలేపు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేనేతపై జీఎస్టీని తొలగించాలని, కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రూ.2500 కోట్లు కేటాయించాలని కోరారు. గౌరవ సలహాదారుడు జామిశెట్టి గాంధీ మాట్లాడుతూ వీవర్స్ అందరూ ఐకమత్యంగా ఉండాలన్నారు. తొలుత గాంధీబొమ్మ సెంటర్‌లో మహాత్మాగాంధీ, బొమ్మన రామచంద్రరావు, బొమ్మన రాజకుమార్, శీలా వీరభద్రుడు విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమానికి నగర అధ్యక్షుడు ఇమ్మంది మోహనరావు అధ్యక్షత వహించారు. నగర కార్యదర్శి పుచ్చల రామకృష్ణ, బళ్ల శ్రీనివాసరావు, ముప్పాన శ్రీనివాస్, నీలం గణపతి పాల్గొన్నారు.

ధవళేశ్వరం: రాజమహేంద్రవరం పద్మశాలీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు ఆధ్వర్యంలో ధవళేశ్వరంలోని ఆయన నివాసంలోని సోమవారం ఇద్దరు చేనేత కళాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి టీడీపీ మండల అధ్యక్షుడు మత్సేటి శివసత్యప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. నీలి కోటేశ్వరరావు, వొగ్గు వెంకటరామారావు, కాకి ధర్మారావు, వానపల్లి రాజారావు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయి రామ్ అధ్యక్షతన కాతేరులోని చేనేత ఉత్పత్తి సహాయ కేంద్రం (సొసైటీ)లో చేనేత కార్మికులను సత్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, రొంగల గోపి శ్రీనివాస్, కురగంటి సతీష్, యానాపు ఏసు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల ధర్నా పోస్టర్ ఆవిష్కరణ

ప్రకాశం నగర్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలనలో కార్మిక, కర్షకులు హీనస్థితికి చేరుకున్నారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాంబాబు, ఐఎఫ్‌టీయూ నాయకుడు కె.జోజి విమర్శించారు. సోమవారం స్థానిక స్టేడియం వద్ద గల ఏఐటీయూసీ కార్యాలయంలో ఈ నెల 9న జరిగే కార్మిక సంఘాల ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై పన్నుల భారాలు మోపుతూ, కార్మికులను బానిసలుగా మార్చేందుకు 46 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లు తెచ్చారని విమర్శించారు. ఎనిమిదేళ్లలో ఆరు లక్షల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడ్డాయని, వీటిలో పనిచేసే లక్షల మంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. క్విట్ ఇండియా స్ఫూర్తితో ఈనెల 9న జరిగే జరిగే ధర్నాకు కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు వి.కొండలరావు, కె.రామకృష్ణ, ఎం.వీరభద్రరావు, కోరాడ అప్పారావు పాల్గొన్నారు.

అవగాహనతోనే నులిపురుగుల నివారణ

కడియం: చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపే నులిపురుగులను అవగాహనతోనే నివారించగలమని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అన్నారు. ఈనెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో కె.రత్నకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారులకు ఆ రోజు నివారణ మాత్రలను పంపిణీ చేస్తారన్నారు. ఈ మేరకు ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వైద్యాధికారి కె.మణిజ్యోత్స్న అన్నారు. ఎంఈవో లజపతి రాయ్, పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఏవో కె.చంద్రరావు పాల్గొన్నారు.

కామన్ సైట్ ఆక్రమణను అడ్డుకోండి



కామన్ సైట్ స్థలం వద్ద లేఅవుట్ ప్లాన్‌ను చూపుతున్న స్థానికులు

ధవళేశ్వరం: స్థానిక ఎంప్లాయీస్ కాలనీలోని లేఅవుట్‌లో కామన్ సైట్, పార్క్ స్థల ఆక్రమణను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సోమవారం కొందరు వ్యక్తులు కామన్ సైట్ స్థలంలో గోడ కట్టేందుకు ప్రయత్నించగా పంచాయతీ అధికారులు అడ్డుకున్నారు. ఈ మేరకు లేఅవుట్‌కు సంబంధించి ప్లాన్ కాపీని వారు చూపుతున్నారు. 1.66ఎకరాలకు సంబంధించి 1992లో ఎల్‌పి నెం.120/92 లేఅవుట్‌ను వేశారన్నారు. దీనిలో కొంతభాగాన్ని పార్క్ స్థలానికి, కొంత స్థలాన్ని ఓపెన్ సైట్‌గా కేటాయించారు. అయితే ఆ స్థలాన్ని తాము కొనుగోలు చేశామని చెబుతూ అక్కడ గోడ కట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని స్థానికులు జె.నాగేంద్ర సాయిరాజ్, బి.వేణుగోపాలశర్మ ఆరోపిస్తున్నారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వానికి చెందిన కామన్ సైట్‌ను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి డి.సూరిబాబును వివరణ కోరగా స్థానికుల ఫిర్యాదు మేరకు గోడ నిర్మాణాన్ని అడ్డుకున్నామన్నారు. లేఅవుట్‌కు సంబంధించి సర్వే నిర్వహించి నిర్ధారిస్తామని తెలిపారు.